క్లుప్తంగా

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

రణస్థలం: అగ్ని ప్రమాదంలో ఇటీవల నారువ గ్రామంలోని నరసయ్యకు చెందిన పూరిల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబానికి పైడిభీమవరానికి చెందిన వ్యాపారస్తులు వద్దాది శ్రీనివాసరావు బియ్యం ప్యాకెట్లు, చీరలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు బుధవారం పంపిణీ చేసి ఆదుకున్నారు. అలాగే పైడిభీమవరం చర్చిలోని 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివ, రాంబాబు, కూర్మారావు, బాలు, రామునాయుడు, సంతు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి



కుశాలపురంలో వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం, అల్లినగరం గ్రామాల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన గొప్పతనాన్ని ప్రజలకు వివరించారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో సిక్కోలు జోరు



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో పీడీ ఎం.వి.రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరిశారు. జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగిన జాతీయస్థాయి సబ్–జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజయదుందుభి మోగించింది. బాలికల జట్టు ద్వితీయ స్థానం, బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలవగా.. జిల్లాకు చెందిన మెట్ట హర్షవర్ధన్, పూజారి కళ్యాణ్‌రామ్, చింతాడ జశ్వంత్‌లు జట్టు విజయంలో కీలకభూమిక పోషించారు. వీరంతా ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన వారే. హెచ్‌ఎం బీవీ సాయిరాం ప్రోత్సాహంతో ఫిజికల్ డైరెక్టర్ ఎం.వి.రమణ శిక్షణలో రాణించారు. జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించడం పట్ల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్, జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి, కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, ఛైర్మన్ బడగల హరిధరరావు, కార్యనిర్వహన కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ, మెట్ట తిరుపతిరావు, బి.సురేష్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.సాంబమూర్తి, పి.సుందరరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, డీఎస్‌డీఓ డాక్టర్ శ్రీధర్‌రావు, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

అష్టోత్తర శత దీపారాధన



విజయ గణపతికి దీపారాధనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో పాలకొండ రోడ్డులోని విజయ గణపతి దేవాలయంలో స్వామివారికి అష్టోత్తర శత దీపారాధనలు బుధవారం జరిగాయి. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్య నగేష్ శర్మల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మండవల్లి రవికి మాతృ వియోగం



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ మీడియా జిల్లా ఇన్‌చార్జి, ఆర్యవైశ్య కుల జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వ్యాపారవేత్త మండవల్లి రవి తల్లి మంగతాయారు (75) గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మృతి చెందారు. దీంతో వారి ఇంట్లో విషాదం అలముకుంది. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు రవి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే పార్టీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కళింగవైశ్య కుల అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, శిమ్మ రాజశేఖర్, ఎంవీ స్వరూప్, ఊన్న నాగరాజు, సుంకరి కృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

వదలని వర్షాలు..
అన్నదాత కుదేలు

● తుఫాన్‌తో రైతు కంట కన్నీరు ● నాశనమైన చేతికొచ్చిన పంట ● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



జి.సిగడాం: జాడలో వరి కుప్పల చుట్టూ చేరిన నీరు

అకాల వర్షాలు అన్నదాతను నిండా ముంచేశాయి. పొలాల్లో, కల్లాల్లో ధాన్యం తడిచిపోవడంతో రైతన్న గుండె చెరువవుతోంది. పలుచోట్ల కోతలు కోయకుండా ఉన్న పొలంలో నీరు చేరడంతో పంట కుళ్లిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో ధాన్యం తడిచిపోవడం, తేమ శాతం పెరిగిపోవడంతో మొలకలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం మిల్లుల వద్ద పెద్ద ఎత్తున ధాన్యం నిల్వలు ఉన్నాయి. అలాగే రైతులు కూడా రోడ్ల వెంబడి ధాన్యం నిల్వలు ఉంచారు. అందువలన వరుణ దేవుడు కరుణించాలని కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ప్రభుత్వం ఆదుకోవాలి



తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. అరుతడి పంటలకు ప్రత్యేక నష్టపరిహారం ఇవ్వాలి. వర్షాలకు తడిసిన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులకు ఇబ్బందులు తప్పవు.

– పేడాడ శ్రీరామమూర్తి, దవళపేట, సి.సిగడాం

నష్టాలపై సర్వే చేపట్టాలి



నవంబర్ చివరి నుంచి అకాల వర్షాలు, తుఫాన్లు కొనసాగుతున్నాయి. ఖరీఫ్‌లో నారాయణపురం కుడి కాలువ కింద సాగునీరు అందక రైతులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం పండిన అరకొర పంటలు చేతికి రాకుండా వర్షాలు వెంటాడుతున్నాయి. అయినా ప్రభుత్వ యంత్రాంగంలో స్పందన లేదు. నష్టాలపై సర్వే నిర్వహించాలి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– అల్లు సూర్యనారాయణ, రామజోగిపేట, ఎచ్చెర్ల

తేమ ధాన్యం కొనుగోలు చేయాలి



ప్రస్తుతం వరి దుబ్బులు తడిచిపోయాయి. పొలాల్లో నీరు చేరింది. తేమ శాతం ధాన్యానికి ప్రధాన సమస్యగా ఉంది. ప్రభుత్వం తేమ శాతం ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలి. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. ఈ ఏడాది రైతులు దయనీయ పరిస్థితులు ఎదుర్కొన్నారు. అకాల వర్షాలు వెంటాడుతున్నాయి.

– పైడి వెంకన్నగారి శ్రీను, కుశాలపురం, ఎచ్చెర్ల

పత్తి రైతులను ఆదుకోవాలి



లావేరులో పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ఎచ్చెర్ల: వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మోహనరావు కోరారు. లావేరు మండలంలోని పలు గ్రామాల్లో పత్తి పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాయకాస్తున్న దశలో వర్షాలు పడడం వలన పత్తి కాయలు పాడయ్యాయని, దీంతో నష్టాలు తప్పేలా లేవన్నారు.



జి.సిగడాం: బాతువలో నాశనమైన పెసర పంట



జి.సిగడాం: గెడ్డకంచరాం-ఎందువ గ్రామాల సమీపంలో తడిసి ముద్దైన అపరాల పంట



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం సమీపంలో పొలాల్లో వరి కుప్పలు




ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస సమీపంలో పొలాల్లో చేరిన నీరు



గార: పెసర కాయలు నుంచి మొలకలు వస్తున్న దృశ్యం



గార: నీట మునిగిన పనలు జాగ్రత్త చేసుకుంటున్న రైతు



ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట పరిధిలో పొలాల్లో వరి ఓవులు

సుపరిపాలనతో పారదర్శకత



మాట్లాడుతున్న ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం న్యూకాలనీ : సుపరిపాలన ద్వారా పారదర్శకత, కచ్చితత్వం సాధ్యపడుతుందని నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ పేర్కొన్నారు. దివంగత ప్రధాని, భారత రత్న అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో గుడ్ గవర్నెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు వాటిని అమలు చేయడం కీలకమన్నారు. సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, శాంతినికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అప్పలరాజు ప్రజలందరికీ కనీస వనరులు అందుబాటులో ఉండేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్.సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు అరుగుల దిలీప్ కుమార్, ఎం.ప్రియాంక, గార మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

శ్రీకాకుళం క్రైమ్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీకాకుళం రూరల్, వన్‌టౌన్, గార, మహిళా పోలీసుస్టేషన్లతో పాటు పలు పోలీసుస్టేషన్లలో సంకల్పం పేరిట కార్యక్రమాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న దాడులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలని కోరారు.

చదరంగం పోటీలు



చెస్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి పురస్కరించుకొని శ్రీకాకుళంలోని నానుబాలు వీధిలో ఉన్న జిల్లా చెస్ శిక్షణ కేంద్రంలో చదరంగం పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో 10 మంది ఇంటర్నేషనల్ రేటెడ్ క్రీడాకారులు, వర్ధమాన క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్ల పాటు ఈ పోటీలు ఉత్కంఠ భరితంగా జరిగాయి. ఈ పోటీలను సనపల భీమారావు లాంఛనంగా ప్రారంభించారు. పోటీలకు విచ్చేసిన క్రీడాకారులకు చౌదరి సత్యనారాయణ ట్రస్ట్ భోజన సదుపాయాలు కల్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ ఆదివారం, అదేవిధంగా ప్రతీ సెలవు రోజున జిల్లాస్థాయి చదరంగం పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఎంతోమంది ఇంటర్నేషనల్ క్రీడాకారులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా టోర్నమెంట్ల నిర్వహణ జరుగుతోందని తెలియజేశారు. ఈ పోటీల్లో ఛాంపియన్‌గా కె.సాయివెంకట్, ద్వితీయ స్థానంలో బొల్లా యశ్వంత్, తృతీయ స్థానంలో ఎ.లోకేష్ నిలిచారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యుడు వసంతరావు, సీనియర్ క్రీడాకారుడు అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జననం..
జగమంతా సంబరం..!

లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మదినాన్ని జిల్లావ్యాప్తంగా ఘనంగా బుధవారం నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చిలు ప్రభువు రాకకు స్వాగతం పలికాయి. మానవాళి రక్షణకు అవతరించిన క్రీస్తుకు మంగళవారం అర్ధరాత్రి నుంచి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



గార: కె.మత్స్యలేశం పురాతన చర్చిలో బాలల క్రిస్మస్‌లో పాల్గొన్న చిన్నారులు



గారలో క్యాండిల్ సర్వీస్‌లో పాల్గొన్న క్రైస్తవులు



జి.సిగడాం: మెట్టవలసలో క్రిస్టమస్ సంబరాలు చేసుకుంటున్న దృశ్యం



గార: ఏసుక్రీస్తు మహిమ మందిరంలో పేదలకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: కీస్టోన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు



శ్రీకాకుళం కల్చరల్: ఫెయిత్ హోమ్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



శ్రీకాకుళం కల్చరల్: పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస పట్నాయిక్



శ్రీకాకుళం కల్చరల్: కల్వరీ టెంపుల్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



రణస్థలం: డబ్ల్యూఎంఈ చర్చిలో పేద క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



అరసవల్లి ఆదిత్యనగర్ కాలనీలో క్రీస్తు బోధనలు



ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

రూ.1.50 లక్షలు వితరణ



రూ.1.50 లక్షల చెక్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలకు చెందిన 23 మంది పిల్లలకు విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో అప్‌హోల్డ్ సంస్థ రూ.1.50 లక్షలు విద్యా సాయాన్ని నగరంలోని తమ కార్యాలయంలో మంగళవారం రాత్రి అందజేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై ఆర్థిక సాయాన్ని చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య అనేది పిల్లల భవిష్యత్తును వెలిగించడానికి ముఖ్యమైన ఆయుధమని, సమాజానికి దార్శనిక మార్గం చూపుతున్నారని ప్రశంసించారు. విద్య ద్వారా సమాజంలో మార్పును తీసుకురావాలన్న లక్ష్యంతో అప్‌హోల్డ్ సంస్థ పనిచేయడం గొప్ప విషయమన్నారు. అప్‌హోల్డ్ డైరెక్టర్ ఫిలిప్ తిమోతీ మాట్లాడుతూ.. ప్రతి పిల్లవాడికి చదువు అనేది ఒక హక్కు అని, ఆర్థిక పరిస్థితులు వారిని అడ్డుకోకూడదని పేర్కొన్నారు. సాయం పొందిన కుటుంబాలు అప్‌హోల్డ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి



విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేసి ప్రజలపై భారాన్ని తగ్గించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యుత్ రంగాన్ని పరిరక్షించాలని కోరుతూ, చండీఘర్ విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చండీఘర్ విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శ్రీకాకుళంలో విద్యుత్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చండీఘర్ రాష్ట్ర డిస్కంను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అయిన కలకత్తాకు చెందిన 'ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్'కు అమ్మడానికి అక్కడి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నెలకు ఒక్కో ఎకరాకు భూమి విలువ రూ.1 మాత్రమే చెల్లించాలని విలువ నిర్ణయించిందని తెలిపారు. ఇలా ప్రతిచోట మోదీ ప్రభుత్వం అత్యధిక లాభాలు గడించే అవకాశాలు ఉన్న విద్యుత్తును ప్రైవేట్ చేయడానికి కంకణం కట్టుకుందన్నారు. రాష్ట్రంలో అదానీతో జరిగిన అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పేదలకు అంధకారమే మిగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, డి.సుధ, ఆర్.ప్రకాష్, పి.గోవర్ధనరావు, కె.కల్యాణి, పి.లత తదితరులు పాల్గొన్నారు.